ప్రారంభానికి సిద్ధం

టీడీపీ జిల్లా కార్యాలయాన్ని పరిశీలించిన కదిరి ఎమ్మెల్యే కందికుంట



జిల్లా టీడీపీ కార్యాలయంలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందికుంట, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప

పుట్టపర్తి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో టీడీపీ జిల్లా కార్యాలయం ప్రారంభానికి సిద్ధమైంది. మామిళ్ల కుంట క్రాస్ వద్ద పార్టీ కార్యాలయంలో ఏర్పాట్ల పనులను కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ బుధవారం పరిశీలించారు. పార్టీ కార్యాలయంలో చేపట్టాల్సిన సౌకర్యాలు ఇతర అంశాలపై జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్పతో చర్చించారు. ఈనెల రెండో వారంలో కార్యాలయం ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి సాముకోటి ఆదినారాయణ. టీడీపీ నాయకులు చంద్రశేఖర్, రత్నప్పచౌదరి, విశ్వనాథ్, బద్రీ తదితరులు పాల్గొన్నారు,

అక్షయ విశ్వాసం 6

పరిహారం త్వరగా అందించాలి

● జేసీ అభిషేక్ కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణం కోసం రైతుల నుంచి సేకరించిన భూములకు నష్టపరిహారం త్వరగా చెల్లించాలని జేసీ అభిషేక్‌కుమార్ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రహదారుల నిర్మాణాలకు సంబంధించిన ఆర్డీవోలు, తహసీల్దార్లతో జేసీ బుధవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ భూసేకరణ పనుల్లో అలసత్వం వహించకుండా త్వరగా పనులు చేయాలన్నారు. అలాగే రైతులకు నష్టపరిహారం అందించడంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు కేసు లు, సమస్యలుంటే పరిహారం కోర్టులో డిపాజిట్ చేయాలని సూచించారు. భూములను సబ్‌డివిజన్ చేయడంతో తహసీల్దార్లు జాగ్రత్తగా పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓలు సువర్ణ, వీవీఎస్ శర్మ, మహేష్, ఆనంద్, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, తహసీలార్లు కల్యాణ్, వెంకటేష్, శేఖర్, మురళీకృష్ణ తదతరులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా..!

నేడు కప్పలబండ ఎంఎస్ఎంఈని ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

నెల్లూరు జిల్లా నుంచి వర్చువల్‌గా..



కప్పలబండ పారిశ్రామిక పార్కు

పుట్టపర్తి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి బాటలు వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా పుట్టపర్తిలోని కప్పలబండ ఎంఎస్ఎంఈ పార్కును సీఎం చంద్రబాబు గురువారం వర్చువల్‌గా ప్రారంభిస్తున్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నారంపేటలో ఆయన ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభిస్తారు. ఆ జాబితాలో కప్పలబండ ఎంఎస్ఎంఈ పార్కు ఉంది. దీంతోపాటు రాప్తాడు నియోజకవర్గంలోని దాదులూరు, పెనుకొండ, కదిరి మండలం మత్యాలచెరువు, మడకశిర మండలంలోని ఆర్ అనంతపురం వద్ద ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తారు.



చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు వద్ద అనుమతులు లేకుండా వెలసిన లే అవుట్

అడ్డగోలుగా..



వెంచర్ల ఏర్పాటులో నిబంధనలు నాస్తి

తియ్యని మాటలతో ప్లాట్ల విక్రయం

'అధికారం' అండగా అక్రమార్కుల దందా

ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి

చిలమత్తూరు మండలంలో అక్రమాల 'రియల్'

చిలమత్తూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వెంచర్ల ఏర్పాటులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. ఎలాంటి నిబంధనలు పాటించకుండానే వెంచర్లలో ప్లాట్లు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ అక్రమ వ్యవహారాలు మండలంలో కోడూరు, చిలమత్తూరు, వీరాపురం, టేకులోడు, దేమకేతేపల్లి పంచాయతీల్లో ఎక్కువగా జరుగుతున్నట్లు సమాచారం. అధికార పార్టీ నాయకుల అండతో రియల్ వ్యాపారులు అడ్డగోలుగా వెంచర్లు వేసేస్తున్నారు. చిలమత్తూరు మండలం బెంగళూరుకు దగ్గరగా ఉండటంతో ఎక్కువగా కర్ణాటక వాసులు ఈ ప్రాంతంలో ప్లాట్లు కొనడానికి వస్తుంటారు. దాంతో ఎక్కడ పడితే అక్కడ నిబంధనలు తుంగలో తొక్కి అరచేతిలో వైకుంఠం చూపించేలా బ్రోచర్లు తయారు చేయించి ప్లాట్లు అమ్మేసుకుంటున్నారు.

వ్యవసాయ పొలాలను కొని

మండలంలోని వ్యవసాయ పొలాలను తక్కువ ధరకు కొని, ల్యాండ్ కన్వర్షన్ లేకుండానే లేఅవుట్లు వేసి, విక్రయిస్తున్నారు. ఇలా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతో భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల కొడికొండ చెక్‌పోస్టు 44వ జాతీయ రహదారి పక్కనే 2.5 ఎకరాల్లో కొత్తగా లేఅవుట్ వేశారు. దాని ఏర్పాటులో ఎక్కడా నిబంధనలు పాటించలేదు. లేఅవుట్ ఏర్పాటుకు పంచాయతీ తీర్మానం కూడా లేదు. కనీసం ల్యాండ్ కన్వర్షన్ కూడా చేయలేదు. కానీ ఆ వెంచర్‌లో ప్లాట్లు అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ఒక్కో ప్లాటు ధర రూ. 8 లక్షల వరకు నిర్ణయించినట్లు సమాచారం. అనుమతులు లేవని తెలిసినా ఏ అధికారి కూడా లేఅవుట్ నిర్మాణ పనులు ఆపలేదు.

లే అవుట్ నిబంధనలు ఇలా...

ఎక్కడైనా ఇంటి స్థలాలకు లేఅవుట్ వేయాలంటే ముందుగా వెంచర్ వేసే వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలి. భూమి విలువ ఆధారంగా నిర్ణీత మొత్తంలో నాలా పన్ను చెల్లించాలి. అనంతరం సంబంధిత పంచాయతీ తీర్మానంతో అహుడా అనుమతి పొందాలి. అనుమతి పొందిన లేఅవుట్ విస్తీర్ణంలో 10 శాతం స్థలాన్ని సామాజిక అవసరాలకు వదిలేసి దానిని పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయాలి. లేఅవుట్‌లో 30 నుంచి 40 అడుగుల వెడల్పు రోడ్లు నిర్మించాలి. మురుగు నీటి కాలువల నిర్మాణం చేపట్టాలి. విద్యుత్, తాగునీటి వసతులు కల్పించాలి.

గత ప్రభుత్వ విధానాలే అమలు

లేఅవుట్ల ఏర్పాటులో గత ప్రభుత్వంలో అవలంభించిన అక్రమ విధానాలనే ఇప్పుడు కూడా అమలు చేస్తున్నట్లు కనపడుతోంది. కొందరు కూటమి పార్టీలకు చెందిన వారమని చెప్పుకుంటూ నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు వేస్తున్నా అధికారులు ఏమాత్రం అడ్డుకోవడం లేదు. ఇలాగే గత వైసీపీ పాలనలో మండలంలో వందల సంఖ్యలో వెంచర్లు పుట్టుకొచ్చాయి. ఇప్పటికీ అదే తంతు జరుగుతోంది. వెంచర్లు ఎక్కడ వెలసినా అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు వెంటనే అక్కడకు చేరుకొని రియల్ వ్యాపారులకు అండగా ఉంటున్నట్లు సమాచారం. ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తాలను రియల్ వ్యాపారుల నుంచి చెల్లించనీయకుండా అడ్డుకుంటూ ఆ మొత్తాన్ని నాయకుల ఖాతాల్లోకి జమ చేసుకుంటున్నట్లు విమర్శలు వినవస్తున్నాయి.

అక్రమ లేఅవుట్లలో స్థలాలు కొంటే సమస్యలు

ఇవే నిబంధనలు పాటించకుండా వేసిన వెంచర్‌లో ఇంటి నిర్మాణానికి పంచాయతీ, మున్సిపాల్టీ అనుమతులు లభించవు. ఇంటి నిర్మాణం కోసం బ్యాంకులు రుణాన్ని మంజూరు చేయవు. ఇలాంటి లేఅవుట్లలో స్థానిక సంస్థలు మౌలిక సదుపాయాలు కల్పించవు. విద్యుత్ కనెక్షన్ ఇవ్వరు. స్థలం విక్రయించాలన్నా రిజిస్ట్రేషన్ చేయరు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ ఇదే తంతు



పంచాయతీ అప్రూవల్ కానీ ఇతర ఏ అనుమతులు కానీ లేకపోయినా స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మాత్రం రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయి. రిజిస్ట్రేషన్ల సమయంలో అధికారులు ముడుపులు తీసుకుంటూ నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే కొత్తగా వెంచర్లు వేసే రియల్ వ్యాపారులు ప్రభుత్వ అనుమతులు లేకుండానే లేఅవుట్లు వేసి విక్రయిస్తున్నారు. సులభంగా రిజిస్ట్రేషన్ జరిగిపోతుండటంతో కొనుగోలుదారులు కూడా వీటిని పట్టించుకోవడం లేదు.

చర్యలు తీసుకుంటాం

లేఅవుట్ల ఏర్పాటులో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ముందుగా భూమిని కన్వర్షన్ చేసుకొని పంచాయతీ అనుమతి తీసుకోవాలి. అన్నీ సక్రమంగా ఉంటే ఆ తరువాత మేమే అహుడాకి అనుమతుల కోసం పంపుతాం. ప్రతి లేఅవుట్‌లో నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలి. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించినట్లు తెలిస్తే వాటిపై చర్యలు తీసుకుంటాం. అనుమతులు వచ్చిన తరువాతే లేఅవుట్ పనులు ప్రారంభించాలి. అనుమతులు తీసుకోకుండా లేఅవుట్ నిర్మాణం చేపడితే చర్యలు తీసుకుంటాం.

\- శివనారాయణరెడ్డి, డీఎల్‌పీఓ, పెనుకొండ



నంబర్ 1

మాంసపు ఉత్పత్తిలో జిల్లాకు ప్రథమ స్థానం

- పౌల్ట్రీ రంగంలో రెండంకెల అభివృద్ధి
- గొర్రెలు, మేకల్లో భారీ వృద్ధి
- స్వల్పంగా తగ్గిన పశు సంపద



పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మాంసపు ఉత్పత్తిలో రాష్ట్రంలో జిల్లాకు ప్రథమ స్థానం దక్కింది. అయితే పశు సంపద మాత్రం తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అదే సమయంలో కోళ్లు, గొర్రెలు, మేకల సంఖ్య భారీగా పెరిగింది. అయిదున్నర నెలలుగా పశు సంవర్ధకశాఖ అఖిల భారత 21వ పశుగణన నిర్వహించింది. గతఏడాది నవంబరు 1న ప్రారంభమైన ఈ గణన ఫిబ్రవరికి పూర్తి చేయాల్సి ఉంది. అయితే రాష్ట్రంలో చాలా జిల్లాలు సర్వేలో వెనుకబడటంతో ప్రభుత్వం ఏప్రిల్ 15 వరకు గడవు పొడిగించింది. జిల్లాలో 624 రెవెన్యూ గ్రామాల్లో 5,43,139 కుటుంబాలకు చెందిన పశువులు, కోళ్లు ఇతర జాతులను లెక్కించారు. 2019 పశుగణనతో పోల్చుకుంటే 2024-2025 సర్వేలో పౌల్ట్రీ రంగం 11శాతం, గొర్రెలు మేకలు 56శాతం పెరగగా, పశుసంపద 4.8 శాతం తగ్గినట్లు తాజా సర్వేలో వెల్లడి అయ్యింది.


పౌల్ట్రీ రంగంలో వృద్ధి

● 2024-25లో చేపట్టిన 21వ పశుగణనలో జిల్లా వ్యాప్తంగా చూసుకుంటే పౌల్ట్రీ రంగం 11శాతానికి పైగా పెరిగింది. హిందూపురం, మడకశిర ప్రాంతాల్లో పౌల్ట్రీరంగం భారీగా విస్తరిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. మహిళలు, యువతకు కోళ్ల పెంపకం ఉపాధిగా మారింది. 2019లో జిల్లాలో 31,30,275 కోళ్లు ఉండగా 2025 ఏప్రిల్ 15నాటికి వాటి సంఖ్య 34,78,131కి పెరిగింది. దీంతో కోడి గుడ్ల ఉత్పత్తిలో రాష్ట్రంలో మూడో స్థానానికి చేరింది. గొర్రెలు, మేకలు, కనగానపల్లి, ధర్మవరం, మడకశిర, నల్లమాడ, ముదిగుబ్బ, సీకేపల్లి, తనకల్లు, తాడిమర్రి ప్రాంతాల్లో అత్యధికంగా పెంచుతున్నారు. 66099 మెట్రిక్ టన్నుల మాంసాన్ని ఉత్పత్తి చేసి రాష్ట్రంలో 1వ స్థానంలో నిలిచింది.

స్వల్పంగా తగ్గిన పశువులు

● జిల్లాలో పశుసంపద గతంతో పోల్చుకుంటే 4.8 శాతం తగ్గిందని తాజా సర్వేలో తేలింది. 2019లో ఆవులు 2,81,000, గేదెలు 95000, రెండు కలిపి 3,76,000 ఉండగా తాజా సర్వేలో వాటిసంఖ్య 3,58,234గా నమోదైంది. గొర్రెలు మేకలు గతంలో 14,70,765 ఉండగా ప్రస్తుతసర్వేలో 22,99,973కి చేరింది. దీంతో వృద్ధి రేటు 56 శాతానికి పెరిగింది. పశుసంపద తగ్గినప్పటికి పాల ఉత్పత్తిలో మెరుగైన స్థానంలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గతంలో ఇంటికి మూడునాలుగు దేశీయ ఆవులు ఉండేవని, ప్రస్తుతం వాటి స్థానంలో సీమ ఆవులు పెంపకం వలన పాల ఉత్పత్తిలో (523142 మెట్రిక్‌టన్నుల పాల ఉత్పత్తి ఉందని) మెరుగైన స్థానంలో ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. 2047 నాటికి పాలు, గుడ్ల ఉత్పత్తిలో జిల్లా మొదటి స్థానంలో నిలవాలనేది లక్ష్యమని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

సర్వే పూర్తి



జిల్లాలో అఖిలభారత పశు గణన సర్వే పూర్తయ్యింది. జిల్లాలో సేకరించిన పశుగణాంక వివరాలు ప్రభుత్వానికి నివేదించాం. జిల్లాలో పశుసంపద కొంతమేర తగ్గినప్పటికి, కోళ్ల పెంపకటం భారీగా పెరిగింది. తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయంపై పశుపోషకులు దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలతో పశుసంపద మరింత పెరిగే అవకాశం ఉంది.

\- డాక్టర్ శుభదాసు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

పరిశ్రమలతో ఆర్థిక ప్రగతి : కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారా ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. మొదట జిల్లాలో పరిశ్రమల శాఖ పనితీరుపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని మరింత విస్తృత పరచడానికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను నిర్ణీత సమయంలోపు పరిష్కరించాలన్నారు. నూతనంగా పారిశ్రామిక రంగంలోకి అడుగు పెట్టాలనుకుంటున్న ఔత్సహిక పారిశ్రామిక వేత్తలకు బ్యాంకర్లతో సమన్వయం చేస్తూ ఆర్థిక వనరులు సమకూరుస్తామని పేర్కొన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మయోజన పథకం గురించి పట్టణ స్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేర్ నాగరాజు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోని సహాని, డీపీఓ సమత, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణకుమార్, డిక్కీ జోనల్ అధ్యక్షుడు కోలా వెంకటరమణ, కర్మాగారాల శాఖ జిల్లా అధికారి క్రిష్ణమూర్తి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి హేమంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

నల్లమాడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వి.రత్న హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో బుధవారం నిర్వహించిన పౌరుహక్కుల దినోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులు, సైబర్ నేరాలు, నూతన చట్టాలు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో భార్యలపై భర్తలు తాగి ఆరాచకాలు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాల్య వివాహాలకు సహకరించిన వారికి చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. పిల్లలు చదువుకునే సమయంలో వారిపై దృష్టి సారించాలని, వారు ఏవిధంగా నడుచుకుంటున్నారని చూడాలని తెలిపారు. శక్తియాప్‌ను మహిళలు డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఆపదలో సమాచారం ఇస్తే పోలీసులు వెంటనే మీవద్దకు వస్తారని తెలిపారు. అనంతరం సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ నరేంద్రరెడ్డి, సర్పంచ్ భారతి, సీనియర్ అసిస్టెంట్ గజ్జల శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ, న్యాయవాది వేమనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఎస్ఈగా సంపత్‌కుమార్



పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)గా కొమ్ము సంపత్‌కుమార్‌ను నియమిస్తూ విద్యుత్‌శాఖ ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ సంతోషరావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎం. సురేంద్ర పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో సెలవులో ఉన్న సంపత్‌కుమార్‌ను జిల్లా ఎస్ఈగా నియమిస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీచేశారు.



వైభవంగా బసవేశ్వర జయంతి

నగరోత్సవంలో అబ్బురపరిచిన ప్రదర్శనలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బసవేశ్వరుడి 919వ జయంతి వేడుకలను జిల్లా వీరశైవ సమాజం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో బసవేశ్వరుడి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నగరంలోని క్లాక్‌టవర్ నుంచి సప్తగిరి సర్కిల్, ఐరన్ బ్రిడ్జి మీదుగా పాతూరులోని పేట బసవేశ్వరస్వామి ఆలయం వరకు నగరోత్సవం నిర్వహించారు. శివుడు, వీరభద్రస్వామి వేషధారణలు, నందికోళ్ల కళా ప్రదర్శనలు, డప్పు వాయిద్యాలు, విన్యాసాలు అబ్బురపరిచాయి.

- క్లాక్‌టవర్ సమీపంలోని బసవేశ్వరస్వామి విగ్రహానికి వీరశైవ మహాసభ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి పూలమాలలు వేశారు. 12వ శతాబ్దంలోనే సమ సమాజ స్థాపనకు కృషిచేసిన జగజ్యోతి బసవేశ్వరస్వామి అని ఆయన అన్నారు. విశ్వగురువు, మహాయోగి బసవేశ్వరుడు చూపిన మార్గం యావత్ ప్రపంచం ఆచరించదగ్గదని అన్నారు.
- ప్రతి సంవత్సరం వైశాఖ మాస శుక్లపక్షం రోజున బసవేశ్వరుని జయంతి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నామని జిల్లా వీరశైవ సమాజం అధ్యక్షుడు ఎంజీ రాజు అన్నారు. బసవేశ్వరుడి వచనాలు మానవత్వానికి ప్రతీకలని, ఆయన నడిచిన మార్గంలో మనమందరం నడుద్దామని పిలుపునిచ్చారు. జిల్లా వీరశైవ సమాజం ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు నాగన్న, కోశాధికారి మల్లికార్జున, మఠం తిప్పేస్వామి, ధనుంజయబాబు, సుశీల, ఇందిరా, లింగేశ్వరి, చంద్రశేఖర్, బిదుకార్ గంగాధర్, నాగార్జున, వీరేష్, రవికుమార్, శివకోటి రాంభూపాల్, చిరంజీవి, విజయ్‌కుమార్ చౌదరి, సుదేవ్ తదితరులు పాల్గొన్నారు.


బసవేశ్వర జయంతి వేడుకల్లో వీరశైవులు






శివ తాండవం చేస్తున్న కళాకారుడు.. విన్యాసం చేస్తున్న వీరభద్రుడి వేషధారి

మనిషి రూపంలో ఉన్న దేవుడు బసవేశ్వరుడు : కలెక్టర్


బసవేశ్వరుడి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మనిషి రూపంలో ఉన్న దేవుడు బసవేశ్వరుడని కలెక్టర్ వినోద్‌కుమార్ కొనియాడారు. బసవేశ్వరుడి జయంతిని బుధవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, పూజలు చేసి కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు నివాళులు అర్పించారు. కలెక్టరు మాట్లాడుతూ బసవేశ్వరుడు ఊరూరు తిరుగుతూ సమాజాన్ని సరిదిద్దే కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కవిగా, తాత్వికుడిగా, గురువుగా, సాంఘిక సంస్కర్తగా సమాజంలో కీర్తించబడ్డారన్నారు. కులాలు, మతాలకు అతీతంగా సమాజశ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడ్డారన్నారు. ఆయన చూపిన బాటలో ప్రతిఒక్కరూ నడవాలని కలెక్టరు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, జిల్లా టూరిజం అధికారి జయకుమార్, డీపీఓ నాగరాజునాయుడు, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు యుగేశ్వరి, అలెగ్జాండర్, వసంతలత తదితరులు పాల్గొన్నారు.

ఇష్టమైతే పాకిస్థాన్‌కే వెళ్లిపోవచ్చు



- ఇక్కడ తిని.. వారిని పొగుడుతారా?
- ఉగ్రవాదులకు నరకం తప్పదు
- గణపతి సచ్చిదానందస్వామి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): 'దేశంలో మారణహోమాన్ని సృష్టిస్తున్న పాకిస్థాన్ మంచిదేనని ఇప్పటికీ మనదేశంలో కొందరు పేర్కొనడం శోచనీయం. పాకిస్థాన్‌పై అంతటి ఇష్టం ఉన్నపుడు వారు కూడా దేశాన్ని వదిలి పాకిస్థాన్‌కు వెళ్లిపోవచ్చు' అని దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీ అన్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని దత్తమందిరంలో బుధవారం నిర్వహించిన విగ్రహ పునఃప్రతిష్ఠ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పహల్గాం ఘటనపై స్పందించారు. భూతల స్వర్గమైన కశ్మీర్ అందాలను వీక్షించేందుకు వెళ్లిన పర్యాటకులను ఉగ్రవాదులు చంపడం దుర్మార్గమని అన్నారు. ధర్మం అడిగి చంపడం మనసుకు చాలా బాధ కలిగిస్తోందని, గతంలో ధర్మం విషయంలో చంపడమనేది ఎక్కడా జరగలేదని అన్నారు. కొత్తగా వివాహ బంధంతో ఒక్కటైన జంటలు విహారయాత్రకు వెళితే.. నవ వధువు కళ్లముందే భర్తను కాల్చి చంపడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ దారుణానికి పాల్పడినవారిని భారత ప్రభుత్వం వీలైనంత త్వరగా శిక్షించాలని ప్రార్థిస్తున్నానని అన్నారు. దాయాది దేశస్థులకు స్నేహముండాలే తప్ప క్రోధముండకూడదని అన్నారు. ఈ దేశానికి చెందినవారే కొందరు ఈ దేశం తిండి తింటూ, ఇక్కడి నీళ్లు తాగుతూ, ఇక్కడ గాలి పీలుస్తూ పాకిస్థాన్‌ను పొగుడుతూ, భారతీయుల మనసులను ఎందుకు కష్టపెడుతున్నారో వారికే తెలియాలని అన్నారు. మనం శాంతియుతంగా శాంతి, ధర్మాన్ని అనుసరిస్తుంటే పాకిస్థానీయులు మనల్ని తక్కువ అంచనా వేస్తున్నారని అన్నారు. మనం ఏ ధర్మంలో పుట్టామో చచ్చే వరకూ అదే ధర్మాన్నే అనుసరించాలి తప్ప వేరే ధర్మానికి మారకూడదని, దీనిని భావితరాలకూ నేర్పాలని సూచించారు. మనలో రాగద్వేషాలు, కోపతాపాలు లేకుండా అంతరూ కలిసికట్టుగా ధర్మ రక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. భారతీయులను బాధకు గురిచేసే పాకిస్థానీయులకు తప్పకుండా దేవుడు నరకప్రాప్తి కలిగిస్తాడని అన్నారు.

అక్షయ విశ్వాసం

కిటకిటలాడిన బంగారం దుకాణాలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


దుకాణంలో ఆభరణాలు ధరించి.. ఆనందంగా..

అనంతపురంలోని ఓ దుకాణంలో సందడి



బంగారు ఆభరణాల దుకాణాలు బుధవారం కళకళలాడాయి. అక్షయ తృతీయను పురస్కరించుకుని జిల్లా ప్రజలు బంగారాన్ని కొనేందుకు ఎగబడ్డారు. సాధారణంగా ఉదయం 10 గంటల తరువాత తెరుచుకునే దుకాణాలను వ్యాపారులు గంట ముందుగానే తెరిచారు. కొత్త కొత్త డిజైన్లు, ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. బంగారం ధరలు భారీగా ఉన్నా.. ఈ రోజున కొంటే సంపద పెరుగుతుందన్న విశ్వాసంతో చాలామంది తమకు వీలైనంత కొనుగోలు చేశారు. సందడి ఎంతున్నా.. ఈ ఏడాది వ్యాపారాలు ఆశించిన స్థాయిలో లేవని వ్యాపారులు అన్నారు. అక్షయ తృతీయను పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతపురం హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథస్వామి, అనంత ఐశ్వర్యేశ్వరస్వామికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో పుష్పార్చనలు, సామూహిక అనంత ఐశ్వర్యేశ్వర స్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదం అందించారు. సాయంత్రం స్వామివారి కీర్తనలు ఆలపించారు. భజన చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మఠం బసవరాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్


కౌంటర్లన్నీ బిజీ బిజీ


హెచ్చెల్సీ కాలనీ మంజునాథస్వామి దేవాలయంలో ప్రత్యేక అలంకరణలో అనంత ఐశ్వర్యేశ్వర స్వామి

పాలిసెట్ ప్రశాంతం

88.69 శాతం హాజరు

ఆలస్యంగా వచ్చినవారికి నో ఎంట్రీ

సెంటర్ల వద్ద ప్రైవేటు కాలేజీల వేట




హమ్మయ్య పరీక్ష రాసేశాం అంటూ బయటకు వస్తున్న విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలకోసం బుధవారం నిర్వహించిన పాలిసెట్-2025 పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 88.69 శాతం విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 14,242 మంది దరఖాస్తు చేసుకోగా, 12,632 మంది హాజరయ్యారని సెట్ సమన్వయకర్తలు జయచంద్రారెడ్డి, సురేష్‌బాబు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 37 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కాగా, పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా వచ్చిన కొందరు విద్యార్థులకు అనుమతి లభించలేదు. దీంతో నిరాశగా వెనుదిరిగారు. హడావుడిలో కొందరు హాల్‌టిక్కెట్స్, పెన్సిల్, ఎరేజర్లను తెచ్చుకోవడం మరచిపోయారు. పరీక్షా కేంద్రాలవద్దకు వచ్చి కంగారుపడ్డారు. సమీపంలోని జిరాక్స్, నెట్ సెంటర్లకు వెళ్లి హాల్ టిక్కెట్స్ తెచ్చుకున్నారు. పెన్సిల్, ఎరేజర్లను పరీక్ష కేంద్రాల వద్ద కొందరు సిబ్బంది, ఇతరులు సమకూర్చారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పరీక్షా కేంద్రాల వద్ద తాగు నీరు, వైద్య సిబ్బందిని ప్రభుత్వం అందుబాటులో పెట్టింది.

ఆలస్యం.. మరిచిపోయాం..

పరీక్ష ఉదయం 11 గంటలకు కాగా, చాలామంది విద్యార్థులు 9 గంటల నుంచే కేంద్రాలకు వచ్చారు. అధికారులు, సిబ్బంది హాల్ టిక్కెట్‌లను పరిశీలించి గదుల్లోకి అనుమతించారు. కొందరు 11 గంటలు దాటిన తరువాత వచ్చారు. అప్పటికే పరీక్ష మొదలైంది. రెండు, మూడు నిమిషాలు మాత్రమే మినహాయింపునిచ్చి అనుమతించారు. ఆ తరువాత వచ్చిన విద్యార్థులను అనుమతించలేదు. విభిన్న ప్రతిభావంతులు తొమ్మిదో తరగతి విద్యార్థులను స్క్రైబ్‌గా తెచ్చుకున్నారు. సదరం సర్టిఫికెట్స్‌లో తక్కువశాతం వైకల్యం ఉన్నవారికి, రిజిస్ట్రేషన్ చేసుకోని వారికి స్క్రైబ్‌ను అధికారులు అనుమతించలేదు.

అప్పుడే వేట..

పరీక్షా కేంద్రాల వద్ద ప్రైవేట్ విద్యాసంస్థల సిబ్బంది విద్యార్థుల వివరాలను సేకరించారు. తమ కాలేజీలలో చేరాలని ఎర వేస్తూ కనిపించారు. చదువు, హాస్టల్ అన్నీ ఉచితమని, ఏ కోర్సులోనైనా చేరవచ్చునని చెబుతూ కరపత్రాలను పంచారు. కౌన్సెలింగ్ సమయంలో తమను సంప్రదిస్తే సలహాలిస్తామని అన్నారు. ఫలితాలు రాకనే ఈ గోల ఏమిటని తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు. 'చేరేదాకా ఉచితం అంటారు. ఆ తరువాత సాకులు చెప్పి డబ్బులు గుంజుతారు..' అని విమర్శించారు.


మా రూం ఎక్కడబ్బా..?


విద్యార్థులకు పెన్సిల్స్ అందజేస్తున్న కానిస్టేబుల్ లింగ


పరుగులు పెడుతున్న విద్యార్థులు


బయట తల్లిదండ్రుల నిరీక్షణ

నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు


నేత్రాలను దానం చేస్తున్న కుటుంబ సభ్యులు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తాను మరణించినా మరో ఇద్దరికి చూపును ఇచ్చాడు పట్టణంలోని చంద్రబాబునగర్‌కు చెందిన పామిశెట్టి గోపాల్(61). ఈయన గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విశ్వదీపసేవాసంఘం వారు గోపాల్ కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. వారి అనుమతితో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ కుళ్లాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో పామిశెట్టి గోపాల్ నేత్రాలను సేకరించారు. నేత్రదానంతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం కలిగిందని సేవా సంసంఘం ఫౌండర్ కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో విశ్వదీపసేవాసంఘం వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, ఖమ్మం మాధవ, జూజురు రఘు, కేశవరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

టీబీ డ్యాంకు కొత్తగేట్లు అమర్చాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్



మాట్లాడుతున్న జగదీశ్

అనంతపురం విద్య, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఆనకట్టకు యుద్ధ ప్రాతిపదికన కొత్త గేట్లు ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీశ్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గసభ్యుడు నారాయణస్వామి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జగదీశ్ మాట్లాడుతూ గత ఏడాది తుంగభద్ర ఆనకట్ట 19వ గేటు కొట్టుకుపోయిందన్నారు. డ్యాం 33 గేట్లు శిథిలావస్థకు చేరాయని అప్పుడే నిపుణులు గుర్తించారన్నారు. ఇంజనీరింగ్ నిపుణులు కన్నయ్య నాయుడు కూడా డ్యాం గేట్లు వెంటనే మార్చాలని తుంగభద్ర బోర్డుకు నివేదిక ఇచ్చారన్నారు. కర్ణాటక, ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాలకు అత్యంత కీలకమైన డ్యాం విషయంలో కేంద్రం నిర్లక్ష్యం వీడాలన్నారు. కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయకార్యదర్శులు మల్లికార్జున, కార్యదర్శివర్గ సభ్యులు రాజారెడ్డి, సంజీవప్ప, శ్రీరాములు, రామకృష్ణ, గోపాల్, కేశవరెడ్డి, నాగార్జున, వీరభద్రస్వామి, సంతోష్, కుళ్లాయిస్వామి, నాగరాజు, పెద్దయ్య, చిన్నప్ప యాదవ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

నిధులు వచ్చేశాయ్

వివిధ సామాజిక వర్గాల భవనాలకు రూ3.20 కోట్లు జమ

ఉరవకొండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఏడాది కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉరవకొండలో కొన్నేళ్లుగా ఆగిపోయిన పనులకు మోక్షం లభించనుంది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవచూపి, 10 సామాజిక వర్గాలకు చెందిన భవనాలు, కల్యాణ మండపాల నిర్మాణానికి రూ.3.20కోట్లు విడుదల చేయించారు. ఆ నిధులు పది రోజుల కిందట పంచాయతీ ఖాతాల్లోకి జమ అయినట్లు తెలిసింది. దీంతో ఆగిపోయిన నిర్మాణాలు పూర్తి కావడానికి మార్గం ఏర్పడింది. 2019లో టీడీపీ హయాంలో రూ.40లక్షలతో షాదీఖానా నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం మారిపోవడంతో అది మొండి గోడలకే పరిమితమైంది. దానిని వైసీపీ ఐదేళ్లు ప్రచారం కోసం వాడుకుంది తప్పా, ఎలాంటి పనులూ చేపట్టలేదు. తాజాగా నిధులు మంజూరు కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆగిపోయిన షాదీఖానా

సామాజిక భవనం	మంజూరైన నిధులు (రూ.లక్షలో)
వాల్మీకి కల్యాణమండపం	50
కురుబ కల్యాణమండపం	50
ముస్లింల షాదీఖానా	50
నాయిబ్రహ్మణ కమ్యూనిటీ భవనం	30
భద్రావతి, భావనారుషీంద్ర భవనం	30
కృష్ణదేవరాయల కల్యాణమండపం	20
ఎస్సీ సామాజిక వర్గం భవనం	25
ఎస్సీ సామాజిక వర్గం భవనం(మాల)	25
కార్పెంటర్ల షెడ్	25
యాదవ కమ్యూనిటీ హాల్	15

ఆర్డీటీకి ఇబ్బందులు తొలగించండి

విదేశీ విరాళాల సేకరణకు అనుమతి ఇప్పించండి

ముఖ్యమంత్రికి జిల్లా ఎమ్మెల్యేల వినతి



సీఎంకు వినతి పత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్, జిల్లా ఎమ్మెల్యేలు

అనంతపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాయలసీమతో పాటు అత్యంత వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి విశేష సేవలందిస్తున్న ఆర్డీటీకి విదేశీ విరాళాల సేకరణకు కేంద్రం నుంచి అనుమతి ఇప్పించాలని జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. సచివాలయంలో బుధవారం ముఖ్యమంత్రిని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, బండారు శ్రావణిశ్రీ కలిసి వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి జిల్లాతో పాటు కర్నూలు, ప్రకాశం జిల్లాల పరిధిలోని వేలాది కుటుంబాలకు ఆర్డీటీ ద్వారా విద్య, వైద్య సేవలతో పాటు మౌలిక వసతులు అందుతున్నాయన్నారు. వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ సంస్థకు విదేశీ విరాళాల నియంత్రణ చట్టం కింద మంజూరు చేసిన అనుమతి పత్రాన్ని పునరుద్ధరించేలా చూడాలని కోరారు. రిజిస్ట్రేషన్ రెన్యువల్ కాకపోవడంతో సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిధుల కొరతతో ఆగిపోయాయన్నారు. ఆరు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న సంస్థ కార్యక్రమాలు ఆగిపోతే దాదాపు మూడు వేల మంది సిబ్బంది బజారున పడుతారన్నారు. బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్లు ఆస్పత్రుల ద్వారా రోజువారీ 2 వేల మంది రోగుల వైద్యసేవలకు విఘాతం కలుగుతుందన్నారు. అదే విధంగా 5600 మంది పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక చేయూత నిలిచిపోతుందన్నారు. 50 పాఠశాలలు మూతపడటంతో పాటు 628 మంది దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆర్డీటీ లైసెన్సు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సీఎం చంద్రబాబు స్పందిస్తూ... ఆర్డీటీ లైసెన్సు పునరుద్ధరణకు కేంద్రానికి లేఖ రాయడంతో పాటు కేంద్ర పెద్దలతో మాట్లాడుతానని హామీ నిచ్చారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ద్వారా కేంద్రానికి తన లేఖను అందజేయాలని జిల్లా ఎమ్మెల్యేలకు సూచించారు.

అమరావతితో బంగారు భవిష్యత్తు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణంతోనే భావితరాలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాజధాని అమరావతి విధ్వంసానికి గురైందన్నారు. దాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అమరావతి 2.0కు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ నెల 2న ప్రధానమంత్రి నరేంద్రమోదీ రూ.43 వేల కోట్ల పనులకు ప్రారంభోత్సవం చేయనున్నారన్నారు. ప్రజా రాజధాని అమరావతి పూర్తయితే 175 నియోజకవర్గాల్లోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మోదీ చేతుల మీదుగా జరిగే ప్రజా రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులు అనుకున్న లక్ష్యం ప్రకారం పూర్తయితే ప్రపంచం గర్వించే రాజధానిని ప్రజలంతా చూస్తారన్నారు. రాజధాని నిర్మాణంతో పాటు రాష్ట్రంలోని మూడు ప్రాంతాల సమానాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం సహకారంతో ముందుకు వెళ్తోందన్నారు. జగన్ తన ఐదేళ్ల పాలనలో అమరావతిని కుప్పకూల్చి ఎక్కడి పనులు అక్కడ ఆపేశారన్నారు. జగన్‌రెడ్డి తీసుకున్న మూడు రాజధానుల ప్రతిపాదన కారణంగా పెట్టుబడులు గణనీయంగా పడిపోయి రాష్ట్ర వ్యాప్తంగా భూముల విలువ పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ నిర్వాకం వల్ల రూ. 2 లక్షల కోట్ల విలువైన 130 పరిశ్రమలు, ప్రఖ్యాత వ్యాపార, విద్యా సంస్థలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. దీంతో లక్షలాది మంది యువత ఉద్యోగాలు కోల్పోయారని గుర్తు చేశారు. రైతుల ప్రాణత్యాగాలు, న్యాయస్థానాల జోక్యంతో రాజధాని అమరావతి చెక్కు చెదరకుండా నిలబడిందన్నారు. ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకుల నుంచి తెచ్చిన నిధులతో అమరావతి పనులు వేగం పుంజుకుంటున్నాయన్నారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సెట్టెం వెంకటేశులు, రాష్ట్ర కార్యదర్శులు గాజుల ఆదెన్న, రామలింగారెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గౌస్‌మొద్దీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

చీనీ టన్ను రూ. 22వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 22,500 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 2,500, సరాసరి రూ. 14వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 1017 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

క్రమబద్ధీకరణపై కసరత్తు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ, అనుబంధ శాఖల రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ఎంపీఈఓల క్రమబద్ధీకరణపై బుధవారం రెండో రోజు కసరత్తు కొనసాగింది. స్థానిక జేడీఏ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ శాఖల అధికారులు సమావేశమై క్లస్టర్ల వారిగా ఏఏ పంటలు సాగవుతున్నాయి..? ఏఏ ప్రాంతంలో ఏ శాఖ సిబ్బందిని నియమించాలన్న దానిపై సమాలోచనలు జరిపారు. మరో రెండు రోజుల్లో ఈ ప్రక్రియ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని జేడీఏ కార్యాలయ వర్గాలు పేర్కొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం విద్య, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కేజీబీవీలలో నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకోడానికి మే 3వ తేదీ వరకూ పొడిగించినట్లు సమగ్రశిక్ష ప్రాజెక్టు ఏపీసీ శైలజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుల గడువు బుధవారం వరకూ ఉండగా మరో మూడు రోజులు పొడిగించామన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ మండలంలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో 3వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను సమర్పించాలన్నారు.

8 నుంచి ఎస్కేయూ పీజీ, బీటెక్ పరీక్షలు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో 8వ తేదీ నుంచి పీజీ, బీటెక్, ఎంసీఏ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ తెలిపారు. పీజీలోని ఆర్ట్స్ కోర్సుల నాల్గవ సెమిస్టర్ విద్యార్థులకు 13వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. బీటెక్ ప్రథమ, ద్వితీయ, తృతీయ రెండో సెమిస్టర్ విద్యార్థులకు 22 వరకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఎంసీఏ విద్యార్థులకు ద్వితీయ సెమిస్టర్ పరీక్షలు ఉంటాయని వివరించారు. ఎంబీఏ విద్యార్థులకు శుక్రవారం నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్లను కళాశాలలో తీసుకోవాలని సూచించారు.

డీఆర్‌డీఏ పీడీ బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా శైలజ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా ఉన్న ఈశ్వరయ్య ఉద్యోగ విరమణ పొందారు. దీంతో సమగ్ర శిక్ష ఏపీసీగా ఉన్న శైలజకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా శైలజ బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగులు కొత్త, పాత పీడీలకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. శైలజ ఇదివరకు డ్వామాలో ప్లాంటేషన్ మేనేజర్‌గా పని చేసిన సంగతి తెలిసిందే.

పలు ప్రాంతాల్లో వర్షం



అనంతపురంలోని శీకంఠం సర్కిల్ వద్ద వర్షం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి వర్షం కురిసింది. అనంతపురం, యాడికి, బొమ్మనహాల్ మండలాల్లో ఓ మోస్తారు వర్షం పడింది. గుత్తి, నార్పల, ఉరవకొండ, శింగనమల, పుట్లూరు, పెద్దవడుగూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

ఒకరు.. ఇద్దరే...!

పంచాయతీ సమావేశాలకు సభ్యుల డుమ్మా

కోరం లేక రెండుసార్లు వాయిదా

రేపు మూడోసారి నిర్వహణకు యత్నం

యాడికి పంచాయతీలో ముసలం



మొదటి నోటీసుతో సమావేశానికి హాజరైన ఒకే ఒక్క వార్డుమెంబరు



రెండోసారి సమావేశానికి హాజరైన ఇద్దరు వార్డుమెంబర్లు

యాడికి, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అయిన యాడికిలో ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. యాడికి గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహణే ఇందుకు నిదర్శనం. ఈ ఏడాది మార్చి 3న సర్పంచు అనురాధ అధ్యక్షతన గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఒకే ఒక్క వార్డు మెంబరు మాత్రమే హాజరయ్యారు. సమావేశం నిర్వహణకు కోరం లేకపోవడంతో వాయిదా వేశారు. రెండోసారి మార్చి 5న సమావేశం నిర్వహిస్తున్నట్లు సభ్యులందరికి నోటీసులు పంపించారు. ఈ సమావేశానికి సర్పంచు అనురాధ, ఇద్దరు వార్డు మెంబర్లు మాత్రమే హాజరయ్యారు. దీంతో రెండోసారి కూడా సమావేశాన్ని వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో మూడోసారి మే2న పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు సభ్యులందరికి పంచాయతీ కార్యదర్శి నోటీసులు పంపించారు. ఈ సమావేశానికైనా సభ్యులు హాజరవుతారా లేదా డుమ్మా కొడతారా అనేది ప్రశ్నార్థకంగానే ఉంది.

ఎమ్మెల్యేని కలవడంతోనే ...

వైసీపీ మద్దతుతో గెలిచిన సర్పంచు అనురాధ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తాడిపత్రిలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డిని కలిశారు. దీంతో పంచాయతీ పాలకవర్గంలో విభేధాలు తలెత్తినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. పంచాయతీ అభివృద్ధి కోసమే తాను ఎమ్మెల్యేను కలిశానని సర్పంచు అనురాధ చెబుతున్నారు. అయినా వైసీపీ మద్దతుదారులుగా ఉన్న వార్డు సభ్యులు దీన్ని జీర్ణించుకోలేక పంచాయతీ పాలకవర్గ సమావేశానికి గైర్హాజరవుతున్నారనే చర్చ జరుగుతోంది. గ్రామపంచాయతీలో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారం కోసం తీర్మానం చేయడానికి పంచాయతీ పాలకవర్గ సమావేశం తప్పనిసరిగా నిర్వహించాల్సి ఉంటుంది. 20మంది వార్డు సభ్యులు ఉన్న యాడికి గ్రామ పంచాయతీలో పాలవకర్గ సమావేశానికి కోరం లేకపోవడం ఏమిటని, ప్రజా సమస్యలపట్ల పాలకవర్గానికి ఉన్న చిత్తశుద్ధి ఇదేనా అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ పంచాయతీలో సమస్యలు కోకొల్లలు

1. యాడికి గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో తాగునీటి సరఫరాచేసే మోటార్లు మరమ్మతులకు గురికావడం
2. గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలు చెల్లింపులు
3. గ్రామ పంచాయతీలో చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపు
4. వీధిలైట్లు, డ్రైనేజీ నిర్వహణ, చెత్త తరలింపు ట్రాక్టర్ల డీజిల్ బిల్లుల చెల్లింపు తదితర అంశాలన్ని గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశంలో చర్చించాల్సి ఉంది.

మే2న నిర్వహించే పంచాయతీ పాలకవర్గ సమావేశం సజావుగా సాగుతుందో లేకపోతే దీనిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో అధికారులే నిర్ణయించాల్సి ఉంది.

డీపీఓకు నివేదిక ఇస్తాం



పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహణను రెండుసార్లు కోరం లేక వాయిదా వేశాం. మూడోసారి సభ్యులందరికి నోటీసులు పంపించాం. సమావేశం నిర్వహణకు కోరం లేకపోతే జిల్లా పంచాయతీ అధికారికి నివేదికను పంపిస్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

- అశ్వత్థమనాయుడు, పంచాయతీ కార్యదర్శి

సీఐ పేరు చెప్పి సరుకులు

ముగ్గురు నిందితుల అరెస్ట్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని పాతూరు తిలక్‌రోడ్డులోని ఓ కిరాణా దుకాణంలో ముగ్గురు వ్యక్తులు సీఐ పేరు చెప్పి సరుకులు తీసుకెళ్లారు. ఆ ఘటనలో వన్‌టౌన్ పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో పాతూరులోని కిరాణాదుకాణానికి ముగ్గురు వ్యక్తులు కారులో వచ్చారు. సరుకులు కట్టమన్నారు. రూ.3వేలు బిల్లయింది అని యజమాని చెప్పగా...టూటౌన్ సీఐ సర్‌కు అని...చెబితే అర్థం కాదా అని వేగంగా వెళ్లిపోయారు. ఈ ఘటనపై దుకాణ యజమాని అంబటి కల్యాణ్ చక్రవర్తి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన లక్ష్మీనారాయణ, రామగిరి మండలం పీఆర్ కొట్టాలకు చెందిన రవి, కనగానపల్లి మండలం నరసంపల్లికి చెందిన జశ్వంత్‌ను అరెస్ట్ చేశారు. వారిలో లక్ష్మీనారాయణ పలుసార్లు టోల్‌గేట్ల వద్ద అధికారుల పేర్లు చెప్పి బెదిరించాడని వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ తెలిపారు.

పార్కులో వీడియో వివాదం

యువతిపై దాడి .. పోలీసులకు ఫిర్యాదు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజీవ్‌చిల్డ్రన్స్ పార్కులో ఓ యువతి వాకింగ్ చేస్తుండగా వీడియోలు తీశాడనే విషయంపై గొడవ చోటుచేసుకుంది. బుధవారం సాయంత్రం నగరానికి చెందిన రుక్సానా రాజీవ్‌చిల్డ్రన్స్ పార్కుకు వాకింగ్‌కు వెళ్లింది. పార్కుకు ప్రభు అనే వ్యక్తి తన భార్య, వదినతో కలిసి పార్కుకు వెళ్లాడు. రుక్సానా వాకింగ్ చేస్తుండగా...ఆమె వెనుకే ప్రభు భార్య, వదిన నడిచి వెళ్తున్నారు. వారిని ప్రభు వీడియో తీశాడు. ఆ సమయంలో తననెందుకు వీడియో తీస్తున్నావని రుక్సానా ప్రశ్నించింది. ఇందుకు ప్రభు తన భార్య, వదినను తీస్తున్నానని చెప్పాడు. దీంతో వివాదమెందుకుని వీడియో తీయవద్దని అతడి భార్య, వదిన చెప్పారు. కానీ మరోసారి వీడియో తీశాడు. దీంతో రుక్సానా వాదనకు దిగింది. ఈ గొడవ చివరకు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. తనపై ప్రభు, అతడి భార్య, వదిన దాడి చేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

3న ద్విచక్రవాహనాల వేలం

అనంతపురం క్రైం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 3వతేదీ 23 బైక్‌లను వేలం వేయనున్నట్లు సీఐ శాంతిలాల్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.3వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని సీఐ తెలిపారు.

49 గొర్రెల అపహరణ.. అదుపులో దొంగలు..?

అనంతపురం క్రైం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలో గొర్రెలు అపహరణకు గురయ్యాయి. కొడిమి గ్రామానికి చెందిన బండి ముసలన్న గ్రామ సమీపంలోని ఫక్రుద్దీన్ పొలంలో నాలుగు రోజుల క్రితం 500 గొర్రెలను తోలాడు. సోమవారం రాత్రి అందులో 49 గొర్రెలను అపహరించారు. ఈ ఘటనలో విచారణ చేపట్టిన అనంతపురం రూరల్ పోలీసులు దొంగలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. దొంగలు సమీప గ్రామస్తులేనని, ఇద్దరూ భార్యాభర్తలని సమాచారం.

చీనీ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు స్థల పరిశీలన

గార్లదిన్నె, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జంబులదిన్నె, కనుంపల్లి గ్రామాల్లో బుధవారం చీనీ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ అధికారి అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి రూ. 3.5 కోట్ల వ్యయంతో చీనీ ఆధారిత పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారులు ఫిరోజ్‌ఖాన్, రత్నకుమార్, మైక్రో ఇరిగేషన్ అధికారి రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరులో ఘోర ప్రమాదం

ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు వైద్య విద్యార్థుల మృతి

ధర్మవరం, అనంతలో విషాదం



అభిషేక్‌రాజ్ మృతదేహాన్ని చూసి విలపిస్తున్న సహ విద్యార్థులు

ధర్మవరం రూరల్/కోవూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు వైద్య విద్యార్థులు మృతిచెందారు. అనంతపురం నగర శివారులోని శిల్పా లేపాక్షి నగర్‌కు చెందిన కిమావత్ రవి నాయక్ కుమారుడు కిమావత్ అభిషేక్ రాజ్, ధర్మవరం పట్టణంలోని లోనికోటకు చెందిన కేశవ్ నాయక్, బొజ్జమ్మ దంపతుల కుమారుడు నవదీయ నరేష్ నాయక్ మృత్యువాత పడ్డారు. దీంతో ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది. నెల్లూరు శివారులోని చింతారెడ్డిపాళెంలో ఉన్న నారాయణ మెడికల్ కళాశాలలో వీరు రెండో సంవత్సరం (2023వ బ్యాచ్) చదువుతున్నారు. బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన చక్రధర్ అక్క నిశ్చితార్థం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు చక్రధర్ స్నేహితులు 12 మంది ఉదయం రెండు కార్లలో బుచ్చిరెడ్డిపాళెంకు వెళ్లారు. మధ్యాహ్నం భోజనాలు పూర్తయ్యాక అందరూ కలిసి అవే కార్లలో తిరుగు ప్రయాణమయ్యారు. పోతిరెడ్డిపాళెం సమీపంలో ఒక కారు అతివేగంతో అదుపుతప్పింది. కారు నడుపుతున్న జీవన్‌చంద్రారెడ్డి బ్రేక్ వేసినా కుదరలేదు. హైవే పక్కనే ఓ పూరింటిలోకి దూసుకెళ్లింది. దీంతో ఇంట్లో సేద తీరుతున్న నిడిగుంట రమణయ్య(65) అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నుజ్జునుజ్జవగా, గుడిసె ధ్వంసమైంది. తీవ్రంగా గాయపడ్డ తమ స్నేహితులను వెనుక కారులో వస్తున్న మిగిలినవారు ఆస్పత్రులకు తరలించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరితోపాటు గుండాల జీవన్‌చంద్రారెడ్డి, గుర్రం యజ్ఞేష్, గోను అభిసాయి పురుషోత్తం అనే ఇతర జిల్లాల వైద్య విద్యార్థులు మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. విషయం తెలియగానే జిల్లా నుంచి ఇద్దరు వైద్య విద్యార్థుల కుటుంబ సభ్యులు నెల్లూరుకు వెళ్లారు. తమ బిడ్డల మృతదేహాలను చూసి బోరున విలపించారు.

కానరాని లోకాలకు 'డాక్టర్'



నరేష్ నాయక్ (ఫైల్)

కొడుకు ఇంటికి వస్తే.. 'మా డాక్టర్ వచ్చినాడు..' అని బంధువులకు ఫోన్ చేసి చెప్పేవారు తల్లిదండ్రులు. తెల్లకోటు వేసుకుని రోగుల ప్రాణాలు కాపాడితే చూడాలనుకున్న వారి కలలు కల్లలయ్యాయి. ధర్మవరం లోనికోటకు చెందిన నరేష్‌నాయక్ మృతితో తల్లిదండ్రులు కేశవ నాయక్, బొజ్జమ్మ దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. కేశవ నాయక్ దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు. ఒక్కగానొక్క కుమారుడు నరేష్ నాయక్ నెల్లూరులోని నారాయణ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్నారు. అదే జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెంలో సహవిద్యార్థి సోదరి నిశ్చితార్థం కోసం స్నేహితులతో కలిసి కారులో వెళ్లాడు. నిశ్చితార్థం ముగిసిన తర్వాత తిరిగి వెళుతుండగా ప్రమాదానికి గురయ్యారు. నరేష్ నాయక్ తండ్రి సెంట్రింగ్ పనులు చేసుకుంటూ కుమారుడిని చదివిస్తున్నాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలియగానే కాలనీలో విషాదం అలుముకుంది. కొడుకు ఇంటికి వస్తే ఆ ఇంట్లో సందడి నెలకొనేదని పలువురు కంటతడి పెట్టారు.

బీటెక్‌లో 98 శాతం ఉత్తీర్ణత

ఫలితాలు విడుదల చేసిన జేఎన్టీయూ వీసీ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్ నాలుగో సంవత్సరం ద్వితీయ సెమిస్టర్(ఆర్20) పరీక్షల్లో 98.62 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఈ మేరకు బుధవారం వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జేఎన్టీయూ పరిధిలోని విద్యార్థులకు బీటెక్, ఎంసీఏ, ఎంబీఏ, ఎమ్మెస్సీ పరీక్షలు నిర్వహించామని అన్నారు. బీటెక్ నాలుగో సంవత్సరం ద్వితీయ సెమిస్టర్(ఆర్20) రెగ్యుల్ ఫలితాల్లో 98.62 శాతం మంది, ఎంసీఏ నాలుగో సెమిస్టర్(21) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల్లో 92.15 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ఎంబీఏ నాలుగో సెమిస్టర్(21) రెగ్యులర్, సప్లమెంటరీలో 88.47, ఎమ్మెస్సీ ప్రథమ సెమిస్టర్(21) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల్లో 85 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని వివరించారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం https://jntuaresults.ac.in/ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ నాగప్రసాద్ నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శంకర్ రాజు, అంకారావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

న్యూస్ బాక్స్



భవన నిర్మాణాలను పరిశీలిస్తున్నఎమ్మెల్యే కందికుంట

పనులు సకాలంలో పూర్తిచేయండి :ఎమ్మెల్యే

కదిరి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో భవనాల నిర్మాణం యుద్ధప్రాతిపదికన, సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆసుపత్రి భవన నిర్మాణాల పనులను ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ భవన నిర్మాణం ప్రారంభమై నాలుగు సంవత్సరాలు అవుతోందని, గడిచిన 11నెలల కాలంలో కాంట్రాక్టర్లు, అధికారులను పలుమార్లు హెచ్చరించినా ఎటువంటి ఫలితం లేకుండా పోయిందని అన్నారు. వచ్చే సోమవారం నుంచి పనులు ప్రారంభించాలని, లేకపోతే ఇతరులకు ఆ పనులు అప్పగిస్తామని అన్నారు. మూడు నియోజకవర్గాల్లోని పది మండలాల ప్రజలు ఈ ఆస్పత్రికి వస్తుంటారని, కావున భవన నిర్మాణం పూర్తి అయితే వివిధ రకాల పరీక్షల కోసం ప్రైవేటు వారిని ఆశ్రయించాల్సి న అవసరం ఉండదని అన్నారు. రెండు, మూడు నెలలోపు పనులు పూర్తి చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ హుస్సేన్, పలువురు అధికారులు ఉన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

కదిరి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం ఉదయం 6.30 నుంచే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎంపీడీఓ పోలప్ప బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ చేయాలని, పింఛన్ల పంపిణీ ఎలా జరిగిందో విచారణ చేస్తూ లబ్ధిదారులకు ఉన్నతాధికారులు ఫోన్లు చేస్తారని, ఆ సమయంలో ఫిర్యాదులు అందితే పింఛన్ పంపిణీ చేసే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తలుపుల మండలంలోనూ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం చేపడుతున్నట్లు ఎంపీడీఓ రామనాయక్ ఓ ప్రకటనలో తెలిపారు.

సజావుగా పాలిసెట్

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలకు కోసం నిర్వహించిన పాలిసెట్ ప్రవేశపరీక్ష బుధవారం సజావుగా జరిగినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ కో-ఆర్డినేటర్ సురేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని ఐదు కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించామని, 1930 మంది విద్యార్థులకు గాను 1705 (89 శాతం) మంది హాజరయ్యారని తెలిపారు.

● కదిరిఅర్బన్ : పాలిటెక్నిక్ కళాశాలో ప్రవేశాల కోసం బుధవారం నిర్వహించిన పాలి సెట్ పరీక్షలు సజావుగా జరిగాయి. పట్టణంలో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1600 మంది విద్యార్థులకు గాను 1,431 మంది హాజరైనట్లు అబ్జర్వర్ నరసింహారెడ్డి తెలిపారు.

రీసర్వేపై సమీక్షా సమావేశం

కదిరిఅర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేపై బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్‌లోని త హసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్‌ఓలతో ఆర్డీఓ వీవీఎస్ శర్మ సమీక్షా సమావేశం నిర్వహించారు. రీసర్వే చేపడుతున్న గ్రామాల్లోని భూ యజమానులకు సర్వే తేదీ, సమయాన్ని ముందుగానే వ్యక్తిగత నోటీసుల ద్వారా తెలపాలన్నారు. గ్రామసభలను సబ్‌కలెక్టర్, రెవెన్యూ డివిజన్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ప్రతి గ్రామాన్ని 200 నుంచి 250 ఎకరాలను ఒక బ్లాక్‌గా విభజించి, ఒక బ్లాక్ టీమ్ గ్రామ సర్వే రెవెన్యూ బృందంతో ప్రతి భూ కమతాన్ని సర్వే చేస్తారన్నారు. బ్లాక్ పరిధిలో ఉండే భూ యజమానులందరికి వాట్సప్ గ్రూపు తయారు చేసి, సమాచారం తెలపాలన్నారు. రైతులకు రీసర్వేపై అవగాహన కల్పించి, సమస్యలు లేకుండా చూడాలన్నారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన



ద్వారనాలలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

గాండ్లపెంట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పోషణ్ పక్వాడ్‌పై పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సీడీపీఓ జయంతి అంగాహన కల్పించారు. మండలంలోని ద్వారనాల గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాంలో ఆమె మాట్లాడుతూ.. బాలింతలు, గర్భవతులు, చిన్నారులు, కిషోర బాలికలు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, సూపర్‌వైజర్ పద్మావతమ్మ, మహిళ పోలీస్ శిరీషా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారులు, బాలింతలు, గర్భవతులు పాల్గొన్నారు.

● బుక్కపట్నం : పౌష్టకాహార వారోత్సవాల్లో భాగంగా పోషణ్ పక్వాడాపై బుధవారం సీడీపీఓ గాయత్రి స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అనంతరం గర్భవతులకు సామూహిక సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కౌసల్య సాయి, ఎంపీడీఓ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ నరసింహులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అంబులెన్స్ సేవలు ప్రారంభం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ

తనకల్లు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటిక్రాస్‌కు చెందిన వందేమాతరం టీమ్ సభ్యులు రూ. పది లక్షలు వెచ్చించి అంబులెన్స్‌ను కొనుగోలు చేశారు. ఆ అంబులెన్స్‌ను బుధవారం బాలసముద్రం సమీపంలోని శివాలయంలో పూజలు చేసి ఎస్ఐ గోపీ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వందేమాతరం టీమ్ సభ్యులు ఉచిత అంబులెన్స్‌ను ప్రారంభించడం హర్షనీయమన్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ సేవలు కావాల్సిన వారు 91107 00917, 93912 44600లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటపల్లి సింగల్ విండో మాజీ అధ్యక్షుడు బాగేపల్లి చలపతి, వందేమాతరం టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి డాక్టరేట్



ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు, డీటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న కట్టుబడి గౌసలాజం డాక్టరేట్ పొందారు. విశాఖపట్నంలో పబ్లిక్ లైబ్రరరీ సమావేశ మందిరంలో బుధవారం అమెరికాన్ మెరిట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో విద్యారంగం, సామాజిక కార్యకర్తగా విశేష కృషికి ఆయన డాక్టరేట్ పొందారు. ఆ సంస్థ ప్రతినిధి డాక్టర్ హస్సీనా ఆయనకు డాక్టరేట్ అందజేశారు.

ఆర్డీటీని ఐకమత్యంగా రక్షించుకుందాం



ధర్మవరం : రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు



ముదిగుబ్బ : తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు

రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆర్డీటీ సంస్థను కుల, మత, రాజకీయాలకు అతీతంగా.. అందరూ ఏకమై రక్షించుకుందామని వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎన్జీఓ భవనంలో ఆర్డీటీ సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు ప్రముఖులు మాట్లాడారు. కరువు ప్రాంతమైన రాయలసీమలో ఆర్డీటీ సంస్థ అనేక మంది పేదలు, బడుగు బలహీనవర్గాల ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు పలు ప్రాంతాల్లో ఆసుపత్రులను ఏర్పాటు చేసిందని, అతి తక్కువ ఫీజులతో వైద్యం అందించి ఆదుకుంటోందని అన్నారు. అలాగే విద్య, వ్యవసాయం, మహిళల అభివృద్ధి, పాఠశాలలు నిర్మాణం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. విదేశాల నుంచి వచ్చే విరాళాలతోనే ఆర్డీటీ ఈ సేవలు అందిస్తోందని, ప్రస్తుతం ఎఫ్‌సీఆర్ఏ అనుమతిని కేంద్ర ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ఆ నిధులు అందడం లేదని, దీంతో ఆర్డీటీ సేవలు ఆగిపోయే పరిస్థితి నెలకొందని అన్నారు. ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ అనుమతిని కేంద్రప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆదిశేషు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయచంద్ర, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున మాట్లాడారు.

● నిరసన ర్యాలీ .. ధర్నా

ముదిగుబ్బ :ఆర్డీటీ సంస్థను రక్షించాలని మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, ఆర్డీటీ సిబ్బంది బుధవారం మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్డీటీ కార్యాలయం వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ నిరసనకు సీపీఐ, ఎమ్మార్పీఎస్, దండోరా నాయకులు మద్దతు తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, ఆర్డీటీ ఏటీఎల్ కృష్ణ, సీపీఐ నాయకులు ఎమ్మార్పీఎస్ నాయకులు, దండోరా నాయకులు, వివిధ గ్రామాల గిరిజన మహిళలు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు : ఆర్డీటీకి విదేశీ నిధులు అందకుండా ఉన్న ఆంక్షలను సడలించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సున్నంపల్లి రమణ, సీపీఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఆర్డీటీకి నిధులు అందకపోవడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనేక మంది పేద విద్యార్థులు, నిరుపేదలు, రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అనంతకుమార్, రామాంజి, శేఖర్, ధన్నా, రాజగోపాల్, పృద్వీరాజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● బత్తలపల్లి : ఆర్డీటీ సంస్థను కాపాడుకుందామని పలు కుల సంఘ నాయకులు స్పష్టం చేశారు. స్థానికంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో పలు కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ... ఆర్డీటీ సంస్థ పేదలకు కూడు, గుడ్డ, విద్య, వైద్యం అందిస్తూ ఆదుకుంటోందన్నారు. ఇలాంటి సంస్థపై కేంద్ర ప్రభుత్వం పలు ఆంక్షలు విధించడంతో విదేశీ విరాళాలు అందడం లేదని, దీంతో సంస్థ సేవలు ఆగిపోయే ప్రమాదం ఏర్పడిందని వాపోయారు. కేంద్రం స్పందించి ఆ ఆంక్షలను సడలించాలని కోరారు. ఇందులో కుల సంఘ నాయకులు కాటమయ్య, రాంప్రసాద్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్‌ఓలు

సీహెచ్‌ఓల వినూత్న నిరసన

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్‌మిషన్ కింద విధులు నిర్వహిస్తున్న సీహెచ్‌ఓల నిరవధిక సమ్మె మూడో రోజైన బుధవారమూ కొనసాగింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ముందు ఒంటి కాలిపై నిలబడి వారు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీఎంసీఏ జిల్లా అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ నందీశ్వర్‌రెడ్డి, చందన, వేణుగోపాల్ పెద్దఎత్తున సీహెచ్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



ధర్మవరం : భూమిపూజ చేస్తున్న హరీష్‌బాబు



ఓడీసీ : ఆలయ నిర్మాణానికి పూజ చేస్తున్న సభ్యులు

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న పురాతన ఆలయం పాండురంగస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి బుధవారం భక్తిశ్రద్ధలతో భూమి పూజను నిర్వహించారు. అతి పురాతనమైన ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. మంత్రి సత్యకుమార్ స్పందించి ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.1.20 కోట్లను మంజూరు చేయించారు. దీంతో బుధవారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నాగరత్నమ్మ, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నరసింహరాజు, నూతన కమిటీ మార్కెట్ యార్డు చైర్మన్ అంబటి అరుణశ్రీ, అంబటి సతీష్, బీజేపీ నాయకులు జింకా చంద్రశేఖర్, సాకే ఓబిలేసు, అంగజాల రాజు, అర్చకులు శ్రీధర్, శ్రీవత్స, ఆలయ సిబ్బంది రామాంజినేయులు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు : మండలకేంద్రంలో కోటగడ్డ సీతారామలక్ష్మణ ఆంజనేయ ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యు లు పిట్టా ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరయ్యశెట్టి, బొడ్డు జయన్న, బొడ్డు నాగరాజు, టీచర్ రామచంద్రారెడ్డి, పిన్ను నరసింహబాబు, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, పిట్టా రాజారెడ్డి, ఆంజి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



తనకల్లులో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

పౌర హక్కులపై అవగాహన

తనకల్లు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ కాలనీలోని ప్రజలకు పౌర హక్కులపై కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి బుధవారం అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలు, హక్కులు, బాధ్యతలపై ప్రతి ఒకరూ అవగాహన పెంచుకోవాలన్నారు. చట్టాలను ఉల్లంగిస్తే తీసుకునే చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోపీ, రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● బత్తలపల్లి : మండలంలోని అప్రాచెరువు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రజలకు తహసీల్దార్ స్వర్ణలత, ఎస్ఐ సోమశేఖర్ పౌర హక్కులపై బుధవారం అవగాహన కల్పించారు. దళితులను ఎవరైనా కులం పేరుతో దూషించినా.. హేళనచేసినా అధికారుల దృష్టి తీసుకురావాలన్నారు. అర్హత కలిగిన వారికి ప్రభుత్వ పథకాలు అందక పోతే నేరుగా వచ్చి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గ్రామాల్లో పాఠశాలలను కొనసాగించాలి



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

కొత్తచెరువు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామీణప్రాంతా ల్లో ప్రాథమిక పాఠశాలలను ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు కొనసాగించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్ అన్నా రు. స్థానిక జడ్పీ హెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తొమ్మిది రకాలుగా ప్రభుత్వ పాఠశాలలను విభజిస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలను లేకుండా చేయడానికి చర్యలు చేపడుతోందన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు విద్యకు దూరం అవుతారన్నారు. కావున బడుల విభజనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. లేకపోతే ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు మే ఐదో తేదీన తాలూకా కేంద్రాల్లో, తొమ్మిదిన జిల్లా కేంద్రంలో, 14న విజయవాడలో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్. చంద్ర, జిల్లా గౌరవ అధ్యక్షుడు పీవీ మాధవ, కమిటీ సభ్యులు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాలో 67 మందికి ఉద్యోగాలు

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం ఐటీఐ కళాశాలలో మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో 11 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ జాబ్‌మేళాలో 110మంది యువతీ, యువకులు హాజరుకాగా.. 67 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగాలు పొందిన యువతీ, యువకులు బాగా రాణించి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ అధికారి తేజ్‌కుమార్, పలు కంపెనీల ప్రతినిధులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



నియామక పత్రాలతో యువతీ, యువకులు

దశాబ్దాలుగా మురుగుతున్న సమస్య..!



బాలాజీ పాఠశాల వెనుక నిల్వ ఉన్న మురుగు



ముళ్లకంపలతో నిండిన మురుగునీటి కాలువ

- కాలువలు లేక వీధుల్లో మురుగు నీరు
- ఇళ్ల మధ్యలోనే నిల్వ
- 40 సంవత్సరాలైనా తీరని వ్యథ
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- దుర్వాసన, దోమలతో ప్రజల ఇబ్బందులు
- పత్రికల్లో వచ్చినప్పుడే అరకొరగా చర్యలు

నల్లమాడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రజలు ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా నాలుగు దశాబ్దాలుగా మురుగు సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారాయి.. పాలకులు మారారు.. అధికారులూ మారారు. కాని ఈ సమస్య మాత్రం నేటికీ అలాగే ఉంది. ఈ సమస్య పరిష్కరించండి మహాప్రభో అని .. పాలకులు.. అధికారులకు స్థానికులు పలుమార్లు విజ్ఞప్తి చేసినా .. ఫలితం శూన్యం. మండల కేంద్రంలో మురుగు కాలువలు లేకపోవడం .. ఉన్న ఒక పెద్ద కాలువను శుభ్రం చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు వీధుల్లో పారుతోంది. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో నిల్వ ఉంటోంది. దీంతో ప్రజలు తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. దోమలు కూడా విపరీతంగా పెరిగాయి. వేసవిలో కరెంట్ పోతే ఇంట్లో ఉక్కపోత నుంచి ఉపశమనానికి ఆరుబయటకు వస్తే.. దోమల దాడికి గురికాకతప్పదు. రోగాల బారిన పడక తప్పదు. గతంలో నల్లమాడ నియోజకవర్గ కేంద్రంగా ఉన్నప్పుడు ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన అగ్గిశం వీరప్ప నాలుగు సార్లు మంత్రి పదవిని అలంకరించారు. అలాగే పల్లె రఘునాథరెడ్డి కూడా మంత్రిగా వ్యవహరించారు. అయినా ఈ సమస్య మాత్రం అలాగే ఉంది. కొత్తమసీదు నుంచి బాలాజీ పాఠశాల వరకు మురుగునీటి కాలువ ఉంది. ఈ కాలువ ముళ్లకంపలు, చెత్తచెదారంతో నిండిపోయింది. మురుగునీరు ముందుకు సాగదు. ఎస్సీ కాలనీలో వీధుల్లోనే మురుగు పారుతోంది. దీంతో పలుమార్లు ద్విచక్రవాహనదారులు, పాదచారులు జారిపడి కాళ్లు, చేతులు విరిగిన సందర్భాలు అనేకం. కొత్త ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అయినా ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి, సమీప ప్రాంతాల్లో గురువారం నిర్వహించే పలు కార్యక్రమాల్లో తాను పాల్గొంటున్నట్లు స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎస్‌బీఐ రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ ఆఫీసు వద్ద ఉదయం 8.30 గంటలకు ఎన్టీయార్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం, తొమ్మిది గంటలకు చిత్రావతి హారతిఘాట్ వద్ద సుందరీకరణ పనుల పరిశీలన, 9.30 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీసత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల వేడుకల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష, 11 గంటలకు మామిళ్ళకుంట కూడలిలో టీడీపీ సీనియర్ నాయకులు దివంగత డాక్టర్ శంకరప్ప వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసప్పగారిపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త వెంకటయ్య గుండెపోటుతో బుధవారం మరణించాడు. అతని మృతదేహానికి మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి నివాళులర్పించారు. అదే గ్రామానికి చెందిన చెల్లా శ్రీరాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా.. అతన్ని పల్లె పరామర్శించారు. బాబా సాహెబ్ పల్లిలో గంగాధర్ అనారోగ్యంతో మరణించగా.. అతని మృతదేహానికీ పల్లె నివాళులర్పించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ నిర్లక్ష్యం

పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి - మండల సమావేశంలో సర్పంచ్ ఆగ్రహం

తనకల్లు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆర్‌డబ్ల్యూఎస్ మండల ఇంజనీర్ కవిత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీంతో పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడితో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని గేమేనాయక్ తండా సర్పంచ్ కాంతమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ వైవీ కౌసల్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖపై చర్చ ప్రారంభించారు. సర్పంచ్ కాంతమ్మ మాట్లాడుతూ .. ప్రస్తుత ఎండాకాలంలో అనేక గ్రామాల్లో ప్రజలు తీవ్ర నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి సమయంలో నిర్వహించిన ఈ సమావేశానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ కవిత గైర్హాజర్ కావడం విధుల పట్ల ఆమెకున్న చిత్తశుద్ధికి నిదర్శమన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా బోర్లు మంజూరు చేసిందని, వెయ్యి అడుగులైనా బోరు వేసి సమస్యను పరిష్కరించాలని నిధులు మంజూరు చేస్తోందని అన్నారు. అయితే ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది కేవలం రెండు, మూడు వందల అడుగుల లోతు బోరు వేసి .. నీరు పడటం లేదని చేతులు ఎత్తేస్తున్నారన్నారు. బోర్లు వేసే ముందు గ్రామంలో ప్రజాప్రతినిధులైన సర్పంచ్‌లకు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తొట్లిపల్లి, రామ్లానాయక్ తండాల వద్ద బోర్లు అర్ధాంతరంగా ఆపివేశారన్నారు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

ఈ సమావేశంలో ఎంపీడీఓ పూల రెడ్డెప్ప, వివిధ శాఖలాధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్


అలంకరణలో సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

చిలమత్తూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. మండలంలోని కోట్లో పల్లి గ్రామంలో మూడు రోజులుగా నూతన ఆలయంలో స్వాముల వారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా గ్రామస్థులు నిర్వహించారు. బుధవారం అర్చకులు సీతారాముల జీవిత ఘట్టాలను భక్తులకు వివరిస్తూ హోమాలను చేశారు. ముందుగా స్వాముల వారికి గంగ పూజ నిర్వహించారు. సుముహూర్తంలో సీతారామలక్షణ సమేత హనుమంత విగ్రహాలను వేదమంత్రాల పఠనం, శ్రీరామన నామ జపంతో ప్రాణప్రతిష్ఠ చేశారు. ప్రతిష్ఠించిన స్వాముల వారికి శుద్ధజలంతో అభిషేకం, పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. విగ్రహ ప్రతిష్ఠకు హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

హిందూపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ఎస్. సడ్లపల్లి గ్రామంలో వెలసిన పురాతన ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయ జీవనోద్ధారణ కార్యక్రమంలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలునిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జీర్ణోద్ధారణ జరిగింది. కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అక్షయ తృతీయ పూజలు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు రాఘవేంద్ర శర్మ

పెనుకొండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ సందర్భంగా పట్టణంలోని వివిధ దేవాలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయాల్లో అర్చకులు రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో ఉదయం 6గంటల నుంచి అమ్మవారికి అభిషేకాలు, 7గంటల నుంచి స్వామివారికి రుద్రాభిషేకం, 9గంటలకు మహామంగళహారతి తీర్థప్రసాద వినియోగం సాయంత్రం 6గంటల నుంచి మహిళచేత సామూహిక లలిత సహస్రనామం, కుంకుమార్చన, కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు ఉచితంగా లక్ష్మీకుబేర యంత్ర డాలర్లు, అమ్మవారికి కుంకుమను అందజేశారు. రాత్రి 9గంటలకు మహామంగళహారతి తీర్థ ప్రసాద వినియోగం గావించారు. అక్షయ తృతీయ సందర్భంగా కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అశేష సంఖ్యలో భక్తులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ రంగనాథ్, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన


ప్రత్యేకాలంకరణలో ఆంజనేయస్వామి, పాల్గొన్న బీకే

గోరంట్ల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చోడురు వాండ్లపల్లిలో ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ, ధ్వంజస్తంభ ప్రతిష్ఠాపన బుధవారం ఘనంగా నిర్వహించారు. పురాతన ఆలయ స్థానంలో నూతన ఆలయం నిర్మించి గత ఐదురోజులపాటు పురోహితులు శేవేంద్ర శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. బుధవారం హోమం, పూర్ణాహుతి, అలంకారం, మహా మంగళహారతి, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ వేడుకల్లో ఎంపీ బీకే పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేడుకల్లో మంత్రి సవిత భర్త, టీడీపీ నాయకుడు వెంకటేశ్వరావు, నాయకులు దేవా నరసింహప్ప, అశ్వర్థరెడ్డి, నీలకంఠారెడ్డి, కన్వీనర్ సోముశేఖర్ పాల్గొన్నారు.

'చట్టాలపై అవగాహన తప్పనిసరి'

సోమందేపల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ రమేష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పందిపర్తి గ్రామం ఎస్సీ కాలనీలో సివిల్‌రైట్స్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ యాక్ట్ గురించి వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ఎస్సీ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

● పెనుకొండ రూరల్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని తహసీల్దార్ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మునిమడుగు గ్రామంలో చట్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కియా ఏఎస్ఐ వెంకటరమణ, వీఆర్ఓ బాలపెద్దన్న, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

● అమరాపురం: పౌరహక్కులపై అవగాహన అవసరమని తహసీల్దార్ లక్ష్మీనరసింహం పేర్కొన్నారు. మండల పరిధిలోని వలస గ్రామంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా లక్ష్మీనరసింహం హాజరై మాట్లాడారు. కులవివక్ష, అంటరానితనం, మూఢనమ్మకాలపై విశ్వాసం, బాల్య వివాహాలపట్ల అవగాహన కలిగివుండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరకరియన్న, సర్పంచ్ జితేంద్ర, హెడ్‌కానిస్టేబుల్ మధుసుధన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

గుడిబండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీసీగిరి గ్రామంలో గురువారం పారిశ్రామికవేత్త జయరాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత సామూహిక వివాహ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పుట్టలక్ష్మమ్మ, జయరాంరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి మాజీ మంత్రి రఘువీరారెడ్డి, తదితర నాయకులు హాజరవుతున్నట్లు వారు తెలిపారు. చుట్టుపక్కల గ్రామస్థులు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చోరీ అయిన సొమ్ము దక్కేనా..?

ఏళ్లు గడుస్తున్నా చోరీకేసుల్లో కనిపించని పురోగతి

పోలీసు స్టేషన్లచుట్టూ బాధితుల ప్రదక్షిణలు

కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం శూన్యం


గత ఏడాది డీఆర్‌కాలనీలో ఓ ఇంటిలో చోరీ జరగ్గా వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీం (ఫైల్)

హిందూపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి)

● నాలుగేళ్ల క్రితం సీపీఐ కాలనీలో చోరీ జరిగింది. దీనిపై బాధితులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఫిర్యాదు స్వీకరించడానికి నెలపట్టింది. కాని బాధితులు ఆపసోపాలు పడి కేసు నమోదు చేయించారు. కాని ఇప్పటికీ ఆ సొత్తు రికవరీ కాలేదు.

● ఏడాదిక్రితం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మోడల్ కాలనీ సమీపంలో ఓ ఉద్యోగి ఇంటిలో దొంగలు పడి సుమారు 18 తులాల వరకు బంగారు అపహరించుకొని వెళ్లారు. అయితేనేటికీ ఆ సొమ్ము రికవరీ చేయలేదు.

● గత ఏడాది ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇంటిలో చోరీ జరిగింది. క్లూస్ టీం వచ్చారు. తనిఖీలు చేశారు. కేసు నమోదు కూడా అయింది. అయితే ఇప్పటి వరకు రికవరీ మాటే లేదు.

● గత ఏడాది జూలై మాసంలో పరిగి బస్టాండ్‌లో బస్సుకోసం వేచి వున్న కర్ణాటకకు చెందిన ఓ మహిళ వద్ద బ్యాగులు సుమారు 30 తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. వెంటనే బాధితులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ కేసు ఏమయిందో పోలీసులకే ఎరుక.

ఇలా చోరీకేసులు పోలీస్‌స్టేషన్లలో ఇప్పటికే కొన్ని పెండింగ్‌లోనే వుంటున్నాయి. అవి ఛేదించక పోవడంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. ఎక్కడైనా దొంగలు దొరికితే తమ సొత్తు స్వాధీనం చేస్తారని పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతు నిరాశతో వెనుదిరుగుతున్నారు. జిల్లాలో ఎక్కడ దొంగలు పట్టుబడిన పత్రికల్లో వార్తలు వస్తే వెంటనే బాధితులు సంబంధిత పోలీసులను ఆశ్రయించి తమ నగలు ఏమైనా దొరికిందా..? అంటూ ఆరాతీస్తున్నారు.

అపహరణ సొమ్ము దక్కేనా...?

ఇదిలా వుంటే ఏళ్ల తరబడి చోరీ అయిన కేసుల్లో రికవరీ చేయకపోవడంతో బాధితులు ఇక తమ సొమ్ము అందుతుందన్న ఆశను వదులుకుంటున్నారు. ఎప్పుడైన చోరీ జరిగిన నెలల వ్యవధిలో పట్టుబడితే సొమ్ము దొరికితే వారి అదృష్టం లేదా రోజులు గడిచే కొద్ది ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఎందుకంటే నెలల తరబడి స్టేషన్‌ల చుట్టూ తిరిగి సొమ్ముపోయి ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి వస్తోంది. అందువల్ల దొరికితే సొమ్ము లేదా వారిదే అని వదిలేస్తున్నారు. ఏళ్లతరబడి కేసులు ఛేదించక పోవడంతో చాలా కేసుల్లో ఆభరణాలు బాధితులకు అప్పగించడంలో పోలీసులు అలసత్వం వహిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

నమోదు కొంతే..

ఎక్కడైన బంగారు ఆభరణలు అపహరణకు గురయితే బాధితులు చెప్పిన మేరకు కాకుండా తక్కువగా పోయినట్లు కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపణలు వున్నాయి. కొన్నేళ్ల తర్వాత దొరికినా ఎఫ్ఐఆర్‌లోనమోదు అయిన ఆభరణాలు మాత్రమే ఇస్తున్నారు. ఇందుకు ఉదాహరణ గత ఏడాది పెనుకొండ సబ్ డివిజన్ పరిధిలో పోయిన సొమ్ములో సగం కూడా ఇవ్వవలేదని బాధితులు అప్పట్లో జిల్లా ఉన్నతాధికారులను ఆశ్రయించారు. దీనిని బట్టి పోలీస్ స్టేషన్‌లో ఎత్తుకెళ్లిన సొమ్ములు పూర్తిస్థాయిలో ఇచ్చిన దాఖలాలు వేళ్లపైన లెక్కపెట్టవచ్చు.

కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం శూన్యం

కొన్ని పోలీస్ స్టేషన్ల పరిదిలో కాళ్లు అరిగేలా బాదితులు కాల్లుఅరిగేలా తిరిగా ప్రయోజనం శూన్యమని బాధితులు వాపోతున్నారు. దొంగతనం కేసులు రికవరీ చేయకపోవడంతో వారు ఆశయలు వదులుకున్నారు. పోలీసులకు మాత్రం వాయిదాలు వేస్తూ పంపిస్తున్నారు తప్పా పూర్తిస్థాయిలో రికవరీ చేసిన దాఖలాలు కనిపించడం లేదు. దీంతో చోరీ జరిగిన కేసులు ఎన్ని ఛేదించిన కేసులెన్నో పోలీసులకే తెలియాల్సిన పరిస్థితి.

ఒక్కొక్కటే పరిష్కరిస్తాం

చోరీ జరిగిన కేసులు ఒకొక్కటే పరిష్కరిస్తున్నాము. దొంగలు దొరికినప్పుడు పాత నేరాలను ఆరాతీస్తున్నాము. ఇటీవల ఇద్దరు నిందితులు పట్టుబడగా గత ఏడాదిలో జరిగిన నేరాలకు సంబంధించిన కేసులను పరిష్కరించాము. పాత కేసవులు కూడా పరిష్కరించడానికి ఆయా పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓలకు ఆదేశించాము.

- మహేశ్, డీఎస్పీ, హిందూపురం

వైభవంగా అక్షయ తృతీయ వేడుకలు

రొళ్ల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాళ్యంలో వెలసిన శ్రీదేవి గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో మహాకుంభ సంప్రోక్షణం, కల్యాణ మహోత్సవం, వేదమంత్రాలు, మంగళవాయిద్యాలతో బుధవారం అక్షయ తృతీయను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్, కిసాన్‌మోర్చ నాయకులు చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు గోవిందరాజు వారిని మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయం పక్కన కేటీడీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రాజకుమార్, స్థానిక ఎస్ఐ వీరాంజనేయులు, టీడీపీ మండల కన్వీనర్ దాసిరెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, రాష్ట్ర ఒక్కళిగ సాధికార కన్వీనర్ పాండురంగప్ప, కార్యదర్శి ఈరన్న, భరత్, శీనప్ప, నాగరాజు, హేమంత్, యోగానంద్ పాల్గొన్నారు.


అక్షయ తృతీయ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే, అతిథులు

ఘనంగా బసవేశ్వర జయంతి

గుడిబండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుబరపల్లి, గుడిబండ, పళారం, మోరుబాగల్, గుణేమోరుబాగల్, బుడ్డదహళ్లి, జమ్మలబండ, తదితర గ్రామాల్లో బసవేశ్వరజయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. బసవేశ్వరస్వామి విగ్రహానికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పావగడ, (ఆంధ్రజ్యోతి): బసవజయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రజలందరినీ ఏకతాటిపై తీసుకొచ్చిన బసవన్న ఆశయాలు ఆచరణీయమని తహసీల్దార్ వరదరాజు పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బసవన్న చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించిన అనంతరం తహసీల్దార్ వరదరాజు మాట్లాడారు. బసవన్న ఆశయ సాధనకోసం కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో గ్రేడ్-2 తహసీల్దార్ చంద్రశేఖర్, ప్రవీణ్ పాల్గొన్నారు.


చికిత్స పొందుతూ మృతి

గోరంట్ల, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టపర్తి రహదారిలో గార్మెంట్స్ పరిశ్రమ వద్ద గాయపడిన రిటైడ్ ఎస్ఐ గోవిందప్ప (64) చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. భార్య కళావతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి ప్రత్యేక శిక్షణా తరగతులు: ఎంఈఓ

మడకశిర రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో ఫెయిలైన విద్యార్థులకు గురువారం నుంచి శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని ఎంఈఓ భాస్కర్ తెలిపారు. మండలంలో 746 మంది ఫెయిలయ్యారన్నారు. వారికోసం మడకశిర, బుళ్లసముద్రం, ఆమిదాలగొంది ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మడకశిర సెంటరులో సిద్దగిరి, పపాసానిపల్లి, గుండుమల, నీలకంఠాపురం, మడకశిర బాలికలు, ఉర్దూ పాఠశాలల విద్యార్థులకు, బుళ్ల సముద్రం సెంటర్‌లో హరేసముద్రం, మణూరు, కల్లుమర్రి, రేకులకుంట, వైబీహళ్లి పాఠశాలల విద్యార్థులకు తరగతులు ఉంటాయన్నారు. ఆమిదాలగొందిలో రొప్ప, చందకచర్ల, గౌడనహళ్లి వారికి శిక్షణ ఉంటుందన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

3న సువర్ణ వాసవీమాత చరవిగ్రహ ఆవిష్కరణ



కరపత్రాలు విడుదల చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

హిందూపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో సువర్ణ వాసవీమాత చరవిగ్రహావిష్కరణ కార్యక్రమం ఈనెల 3న నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జేవీకేరాము, శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, తదితరులు మాట్లాడుతూ 3న జరిగే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, సవిత హాజరవుతారన్నారు. ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ అధ్యక్షులు చిన్న రామ సత్యనారాయణ పాల్గొంటారన్నారు. ఈనెల6న 600మందికి వడిబియ్యం కార్యక్రమం, 7న వాసవీజయంతి సందర్భంగా బైక్ ర్యాలీ ఉంటుందన్నారు.

'విగ్రహాలకు కంచె ఏర్పాటు చేసుకోండి'

సోమందేపల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): విగ్రహాలకు కంచె ఏర్పాటు చేసుకోవాలని టీడీపీ నాయకుడు చంద్ర, ఎస్ఐ రమేష్ కోరారు. మండలకేంద్రంలో ఎన్టీఆర్ సర్కిల్‌వద్ద ట్రాఫిక్ సమస్య కారణంగా డివైడర్లు తొలగించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన విగ్రహాల చుట్టూ కంచెలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బుధవారం మరమ్మతులు చేస్తున్న ప్రదేశాన్ని వారు పరిశీలించారు.

విజ్ఞాన విహారయాత్రలో పాల్గొన్న విద్యార్థులు

పరిగి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మూడో విడతగా సైన్స్ అధికారి తనూజ్ ఏర్పాటుచేసిన విహారయాత్రకు విద్యార్థులు అరుణ్, అభిమారం, దినేష్, మహేష్, మనస, గౌతమ్, ఉదయ్‌శంకర్‌రెడ్డి, గౌతమ్‌నాయుడు, ఫ్రాన్సెస్, ప్రశాంత్ వెళ్లారు. బెంగళూరులోని విశ్వేశ్వర మ్యూజియం, అక్వేరియం సందర్శించారు.

'గర్భిణుల్లో రక్తహీనత నివారణే లక్ష్యం'


పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధికారులు

గోరంట్ల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): గర్భిణుల్లో రక్తహీనతకు నివారణే లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఉర్దూ ఉన్నతపాఠశాలలో పౌష్టికాహార పకోత్సవాల్లో భాగంగా సమావేశం నిర్వహించారు. గర్భిణులు ఆరోగ్యంగా ఉండడం కోసం ప్రతిరోజు ఆకుకూరలు, కూరగాయాలు, పండ్లు, చిరుధాన్యాలు, తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు జాన్‌రెడ్డిప్ప, గోపాల్, మెడికల్ అధికారి వాసు, హెచ్‌ఎం. ఫిరోజ్, సూపర్‌వైజర్లు నాగరాణి, రజిత పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంతో అధిక ఆదాయం

ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు

మడకశిర టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పుట్టగొడుగులతో అధిక ఆదాయం సాధ్యమని డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం డిగ్రీ కళాశాలలో పుట్టగొడుగులపై రెండు నెలలు శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుట్టగొడుగులు క్యాన్సర్, డయాబెటిస్ రాకుండా ఉపకరిస్తాయన్నారు. గుండెజబ్బులు తదితర వ్యాధుల నివారణలో పుట్టగొడుగులు ఎంత ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ భాస్కర్, కళాశాల ఆధ్యాపకులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో అన్ని చెరువులు నింపాలి

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ ద్వారా నియోజకవర్గంలోని అన్ని చెరువులు నింపాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మిట్ట ఆంజనేయస్వామి దేవాలయ ఫంక్షన్‌హాల్‌లో వెనుకబడిన ప్రాంతల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగరాజు, శ్రీనివాసులు ప్రజా సంఘాలు, రైతు సంఘాల నాయకులు హాజరయ్యారు. సమావేశంలో వారు మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ ద్వారా 11వేల క్యూసెక్కులనీరు వచ్చేలా వెడల్పు చేయాలన్నారు. పరిశ్రమల కోసం సేకరించిన భూముల్లో పరిశ్రమలు స్థాపించి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పెనుకొండ వద్ద ఉన్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. ఉపాధిహామీ పనులు 150రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు.

న్యాయాధికారి బాధ్యతల స్వీకరణ

హిందూపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): హిందూపురం సీనియర్ సివిల్ న్యాయాధికారిగా వెంకటేశ్వర్లునాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా గతంలో ఇక్కడ పనిచేసిన న్యాయాధికారి శ్రీధర్ శ్రీకాకుళం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చిత్తూరు జిల్లా మదనపల్లిలో పనిచేస్తున్న వెంకటేశ్వర్‌నాయక్‌ను హిందూపురం వచ్చారు. బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏడీజే కంపల్లె శైలజను మర్యాదపూర్వకంగా కలిశారు.

'మురుగునీటిని రోడ్లపైకి వదిలితే చర్యలు'

సోమందేపల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మురుగునీటిని రోడ్లపై వదిలితే అలాంటివారిపై చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు తెలిపారు. బుధవారం మండలకేంద్రంలోని రాంబాబు కాలనీలో టీడీపీ నాయకులు వడ్డె సూరీతో కలిసి పర్యటించారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో పలువురు మురుగునీటిని రోడ్లపై వదిలేస్తుండటంతో దుర్వాసనతోపాటు రోగాలు ప్రబలుతున్నాయని స్థానికులు సమస్యలను కార్యదర్శి దృష్టికి తెచ్చారు. సంబంధిత గృహాల యజమానులను ఆయన పిలిచి మందలించారు. ఇళ్ల ముందు మురుగు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇళ్ల ముందు వీటిని వదిలితే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ గంగప్ప

హిందూపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో బుధవారం జరిగిన పాలిసెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. బుధవారం ఉదయం 11గంటల నుంచి 1గంట వరకు పరీక్షలు జరిగాయి. పట్టణంలోని ఎంజీఎం పాఠశాల, బాలాజీ, బాలయేసు జూనియర్, డిగ్రీ, సప్తగిరి కళాశాలల్లో పరీక్షా కేంద్రం నిర్వహించారు. ఐదు సెంటర్లలో 1859మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 271మంది గైర్హాజరైనట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ హరీష్, ఎంఈఓ గంగప్ప తెలిపారు.

శ్రీకంఠపురం కట్టపై విద్యుత్ లైను ఏర్పాటు


విద్యుత్ తీగలను లాగుతున్న దృశ్యం

హిందూపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా శ్రీకంఠపురం కట్టపై లైట్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులతోపాటు పూలకుంటవాసులు కోరుతూవచ్చారు. గత తెలుగుదేశం హయాంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేశారు కానీ లైను ఇవ్వలేదు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో ఇటీవల హిందూపురానికి పర్యటనకు వచ్చిన ఆయన శ్రీకంఠపురం కట్టపై విద్యుత్ లైను ఏర్పాటుచేసి ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పూలకుంట సర్పంచ్ మంజునాథ్ సమస్యను అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. దీంతో విద్యుత్ తీగలను ఏర్పాటుచేశారు. విద్యుత్‌బల్బులు కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

సమస్యలను పరిష్కరించండి: ఏఐటీయూసీ

పెనుకొండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు సీడీపీఓ శాంతలక్ష్మిని కోరారు. ఈ మేరకు బుధవారం ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. వేసవి కాలం నేపథ్యంలో చిన్నారులు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉన్నందున మే నెల సెలవులు ప్రకటించాలన్నారు. బాల సంజీవనీ యాప్‌లో మార్పులు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా నాయకులు రమేష్, డివిజన్ కార్యదర్శి శ్రీరాములు, నారాయణస్వామి, జాఫర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

'భూ రీసర్వే నిలుపుదల చేయాలి'

పెనుకొండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మడకశిర మండలం సి.కొడిగెనహళ్లి, కేతేపల్లి, ఇతర గ్రామాల్లోని భూముల్లో సర్వే చేపడుతున్నారని ఈ సర్వేలను నిలుపుదల చేయాలని కోరుతూ రైతు సంఘం, సీఐటీయూ నాయకులు ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు బుధవారం వినతి పత్రం అందించారు. 20ఏళ్ల క్రితం రసాయ్ కంపెనీ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ఇంటికో ఉద్యోగం ఇస్తామని మాయమాటలు చెప్పి రైతుల భూములను తక్కువ ధరకే తీసుకున్నారన్నారు. అయితే ఇంతవరకు పరిశ్రమలు పెట్టలేదని, ఉద్యోగాలు కూడా రాలేదన్నారు. పదేళ్లుగా సాగుచేసుకుంటున్న భూములు తిరిగి రైతులకు వెనక్కు ఇవ్వాలని నిరసనలు, పోరాటాలు చేయడం జరుగుతోందన్నారు. ఇప్పుడు ఆ భూములను రీసర్వేచేస్తామని చెబుతున్నారని, ఈ సర్వేచేయడంవల్ల రైతులకు తీవ్రంగా అన్యాయం జరుగుతుందన్నారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు సర్వే నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, సీఐటీయూ మండల కన్వీనర్ బాబావలి, నరసింహ, ఆనంద్ పాల్గొన్నారు.

దుక్కిలో పొడివిత్తనాలతో ప్రయోజనాలు: ఏడీఏ

గోరంట్ల, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): తొలకరి వర్షాలకు ముందే దుక్కిలో పొడి విత్తనాలు చల్లడం వల్ల అనేకప్రయోజనలు లభిస్తాయని, డీఆర్‌సి ఏడీఏ సనావుల్లా తెలిపారు. మండలంలోని వానవోలు గ్రామానికి చెందిన రైతు శంకరప్ప పొలంలో బుధవారం వ్యవసాయాధికారులు ప్రీ మాన్‌సూన్ డైసోయింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదు రకాల ప్రధాన పంటలతోపాటు 20రకాలవివిధ పంట విత్తనాలను కలిపి దుక్కిలోచల్లాలని ఏడీఏ సూచించారు. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే విత్తనాలు మొలకెత్తడంతోపాటు, సూక్ష్మ పోషకాల సంఖ్య పెరిగి నేల తేమగా ఆరోగ్యంగా ఉండడం వల్ల రైతుకు మంచి దిగుబడులతో ఆదాయం ఉంటుందన్నారు.

'సమస్యలు పరిష్కరిస్తాం'

పెనుకొండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు శుభోదయం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని తోటగేరి, కుమ్మరదొడ్డి వీధుల్లో కూటమి నాయకులు శుభోదయం నిర్వహించారు. ఈ సందర్భంగా 20వ వార్డులో ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ సమస్యలను నాయకుల దృష్టికి వార్డువాసులు తీసుకెళ్లారు. అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరిస్తామని వారికి నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కన్వీనర్ శ్రీరాములు, త్రివేంద్ర, సుబ్రహ్మణ్యం, ప్రభంజన్, నారాయణనాయక్, నరేంద్ర, పులగూర్ల శ్రీనివాసులు, కురుబ నంజుండ, రామక్రిష్ణ, జనసేన శ్రీదేవి, బాబా పాల్గొన్నారు.